క్లుప్తంగా

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పట్టణంలోని నెహ్రూనగర్ జెడ్పీ హైస్కూల్‌లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్ ప్రారంభించారు. విద్యార్థులు రాగిజావను తాగాలన్నారు. ఐరన్, కాల్షియంతోపాటు పోషకాలుంటాయన్నారు. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ, మండల విద్యాధికారి దూస రఘుపతి , పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మోతిలాల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

వేములవాడరూరల్: జాతీయస్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో హన్మాజిపేట విద్యార్థులు ప్రతిభ చాటారు. హైదరాబాద్ బోడుప్పల్ లో జరిగిన పోటీల్లో హన్మాజిపేటకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఎంఏ మన్నాన్, కనికరపు రాజశేఖర్, హెచ్‌ఎం శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్ విద్యార్థులను అభినందించారు.

రాజన్న సేవలో సింగర్ వరం

వేములవాడ: వేములవాడ రాజన్నను ప్రముఖ తెలుగు గాయని వరం మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు హుండీ లెక్కింపు

వేములవాడ రాజన్న హుండీ లెక్కింపును ఈనెల 18న స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో నిర్వహించనున్నట్లు ఈవో రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలన్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా



కార్యకర్తలతో మాట్లాడుతున్న రసమయి

ఇల్లంతకుంట: కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మానకొండూర్ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని గొల్లపల్లి, వెంకట్రావుపల్లిలోని కార్యకర్తలను మంగళవారం కలిసి మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ సిద్ధం వేణు, చెరుకుపల్లి రాజిరెడ్డి, బాలగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన

ఎల్లారెడ్డిపేట: నగదు రహిత లావాదేవీలపై మహిళా సంఘాల సభ్యులకు అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. మండలకేంద్రంలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీపీఎం పద్మయ్య మాట్లాడుతూ మహిళలు నగదు రహిత లావాదేవీలపై దృష్టి సారించాలన్నారు. ఏపీఎం నర్సయ్య, సీసీలు పద్మ, సీఆర్పీలు జ్యోతి, చామంతి, వీవో అధ్యక్షురాలు ప్రమీల వీవోఏ శోభ తదితరులు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాలిపెల్లి పల్లె దవాఖాన వైద్యుడు కట్ట రమేశ్ అన్నారు. మండలంలోని కేసన్నపల్లిలో మంగళవారం వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. 64 మందికి వివిధ పరీక్షలు నిర్వహించిన మందులు అందజేసినట్లు తెలిపారు. ఏఎన్‌ఎం కవిత, ఆశాలు రజన, లక్ష్మీ ,సరిత, తదితరులు పాల్గొన్నారు.

సెస్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

గంభీరావుపేట: గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం మండలకేంద్రంలోని షాదీఖానాలో ఏర్పాటు చేయనున్న విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సెస్ మేనేజింగ్ డైరెక్టర్ భిక్షపతి, ఏఈ ఆనంద్ కుమార్, సెస్ డైరెక్టర్ నారాయణరావు కోరారు.

గంజాయి విక్రేత అరెస్టు

ఇల్లంతకుంట: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మొగిలి తెలిపారు. మండలకేంద్రానికి చెందిన మామిడి శ్రీకాంత్ జంగారెడ్డిపల్లి కమాన్ వద్ద గంజాయి విక్రయించేందుకు ఉండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద 43 గ్రాముల గంజాయి, ఫోన్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నివాళి

బోయినపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మాన్వాడలో కామ్రేడ్ జోగినిపల్లి ఆనందరావు స్మారక స్థూపం వద్ద సీపీఐ నాయకులు నివాళిఅర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కదారి రాములు, కే.వి అనసూర్య, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ప్రారంభమెప్పుడో ?

- గంభీరావుపేటలో రూ. కోటిన్నరతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం
- పనులు పూర్తయినా ప్రారంభించని అధికారులు
- అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గంభీరావుపేట పీహెచ్‌సీ భవనం

గంభీరావుపేట: గంభీరావుపేటలో ప్రజలకు వైద్య సేలవందించేందుకు ప్రభుత్వం రూ. కోటిన్నర వ్యయంతో ఆధునిక హంగులతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నూతన భవనాన్ని నిర్మించింది. విశాలమైన గదులు, రోగుల సౌకర్యాలకు అనుగుణంగా గదులు, పరీక్షల గదులు, ల్యాబ్‌లు, ఫార్మా గదులు అన్నీ సిద్ధంగా ఉన్నాయి. కానీ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రారంభించడం లేదు. ప్రస్తుతం గంభీరావుపేట పీహెచ్‌సీని మండలంలోని లింగన్నపేట పీహెచ్‌సీలో కొనసాగిస్తున్నారు. కొత్త భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. రూ.కోటిన్నర ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఆస్పత్రిని మూసి ఉంచడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది లింగన్నపేటలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ ప్రారంభిస్తే వారు ఇక్కడి పీహెచ్‌సీలో పనిచేయనున్నారు.

అందుబాటులోకి తేవాలి



ప్రజారోగ్యం కోసం నిర్మించిన కొత్త ఆస్పత్రిని వెంటనే అందుబాటులోకి తేవాలి. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రూ.కోటిన్నర ఖర్చు చేసినా భవనం మాత్రం మూసిఉంచడం దురదృష్టకరం.

– దోసల శంకర్, గంభీరావుపేట

పీహెచ్‌సీని ప్రారంభించాలి



తక్షణమే కొత్త ఆస్పత్రినిప్రారంభించాలి. ఇక్కడి పీహెచ్‌సీని లింగన్నపేటలో కొనసాగిస్తున్నారు. అన్ని సౌకర్యాలతో నిర్మించిన భవనాన్ని అధికారులు అందుబాటులోకి తేవడం లేదు. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభించడం లేదు.

– కోడె రమేశ్, గంభీరావుపేట

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

చందుర్తి: ఉపాధ్యాయులకు ప్రభుత్వం పీఆర్సీని వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడుయ దుమాల రమానాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని నర్సింగపూర్ జెడ్పీ పాఠశాల ఆవరణలో టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మందాడి శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్లకృష్ణ చైతన్య, మండల అధ్యక్షుడు తాటికొండ సంజీవ్, కొత్తూరు శ్రీధర్, పాము వెంకట్, కర్ర శ్రీధర్, రాచకొండ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మంగళవారం వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో మండలస్థాయిలో నిర్వహించిన ఎస్సే రైటింగ్ కాంపిటేషన్‌లో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయిలో రాణించారు. ఎస్సే రైటింగ్‌లో ఎల్. త్రిపుర, డి. చేతన, డిబేట్ కాంపిటేషన్‌లో వి. సాయి సహస్ర, జి. త్రివేన్‌రెడ్డి, ఎం. సహస్ర మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మురళీధర్ తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎస్పీ మహేశ్ బి గీతే అభినందించారు.

అధికారులు సమాచారం ఇవ్వడం లేదు

సిరిసిల్లటౌన్: కలెక్టర్ కార్యాలయానికి మంగళవారం వచ్చిన రాష్ట్ర సమాచార కమిషనర్‌ను ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల కమలాకర్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో అధికారులు సమయానికి సమాచారం ఇవ్వకపోగా దరఖాస్తుదారులను సమాచార హక్కు చట్ట కార్యకర్తలను బెదిరిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడిసె ప్రభాకర్, గొల్లపల్లి డేవిడ్ పాల్గొన్నారు,

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై లక్ష్మణ్

వీర్నపల్లి: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వేముల లక్ష్మణ్ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ మోసాలపట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చదువుపై దృష్టిసారించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధలు భరించలేక వ్యక్తి ఆత్మహత్య



శంకర్‌నాయక్ (ఫైల్)

ముస్తాబాద్: ఇంటి నిర్మాణానికి చేసిన అప్పుల బాధలు భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు.. ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండాకు చెందిన భూక్య శంకర్‌నాయక్(55) మూడేళ్ల క్రితం ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పు ఎలా తీర్చేదంటూ కొద్ది రోజులుగా తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాడు. ఇంటి వెనుకగల చెట్టుకు సోమవారం రాత్రి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి అపస్మారక స్థితిలో ఉన్న శంకర్‌నాయక్‌ను సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్‌లో మంగళవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంనిర్వహించారు. 103 మంది రోగులను పరీక్షించారు. పదిమంది నుంచి తెమడ నమూనాలు సేకరించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రాజయ్య, ఎంఎల్‌హెచ్‌పీ ప్రసూన, ఏఎన్‌ఎం లత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన

కోనరావుపేట: యూరియా కోసం మామిడిపల్లిలో మంగళవారం రైతులు రాస్తారోకో చేపట్టారు. దీంతో వాహనాలు నిలిచిపోవడంతో అంతరాయం ఏర్పడింది. ఇప్పటివరకు ఒక్క బస్తా యూరియా రైతులకు ఇవ్వలేదన్నారు. అధికారులు స్పందించి తమకు సరిపడా యూరియా అందించాలని రైతులు ముత్యాల కిషన్ రెడ్డి, జవ్వాజి రాజు గౌడ్‌లు తదితరులు కోరారు.

సంక్షిప్త వార్తలు

• 15 రోజులు సేవా కార్యక్రమాలు

వేములవాడ: ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని వేములవాడలో బుధవారం నుంచి 15 రోజులపాటు సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, పట్టణశాఖ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ తెలిపారు. బుధవారం రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

• వర్గీకరణ చట్టాన్ని పునరాలోచించాలి

సిరిసిల్లఅర్బన్: ఏబీసీడీ వర్గీకరణ ద్వారా మాలలు తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చట్టాన్ని పునరాలోచించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. మంగళవారం పెద్దూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంతకు ముందు జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీరటి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్, ఉపాధ్యక్షుడు మూల కిషోర్, మహేశ్ తదితరులను ఎన్నుకున్నారు.

• విజయవంతం చేయండి

బోయినపల్లి: కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఈనెల 18న నిర్వహించే బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కార్యకర్తల సమావేశం విజయవంతం చేయాలని ఆ పార్టీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాంకాళి తిరుపతి కోరారు. మంగళవారం బోయినపల్లిలో కార్యకర్తలతో మాట్లాడారు. నేషనల్ కో ఆర్డినేటర్‌గా ఎన్నికైన అతర్ సింగ్‌రావు, సెంట్రల్ కో ఆర్డినేటర్ సురేశ్ ఆర్యా, నూతన రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం శేఖర్, స్టేట్ కో ఆర్డినేటర్ దాగిల్ల దయానంద్ తదితరులు హాజరవుతారన్నారు.

• టై, బెల్టులు అందజేత

చందుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం చీమన్‌పల్లికి చెందిన మంకాళి స్వాతి, హరీశ్ దంపతులు విద్యార్థులకు టై, బెల్టు, విద్యార్థులకు గుర్తింపు కార్డులను ఎంఈవో వినయ్‌కుమార్ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

• నిలకడగా వృద్ధుడి ఆరోగ్యం

సిరిసిల్ల: తమను కొడుకు, కోడలు పట్టించుకోవడం లేదంటూ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఆత్మహత్యా యత్నానికి యత్నించిన వృద్ధుడు క్షేమంగా ఉన్నట్లు జిల్లా వైద్యాధికారి రజిత మంగళవారం తెలిపారు. రుద్రంగికి చెందిన అజ్మీరా విఠల్ భార్యతో కలిసి సోమవారం ప్రజావాణికి వచ్చారు. తమను కొడుకు, కోడలును పోషించడం లేదంటూ గడ్డి మందుతాగాడు. స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తన వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి హుటాహుటిన తరలించాలని సూచించారు. వృద్ధుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు.

• రాజన్న భక్తులకు భద్రత కరువు

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆలయ ఆవరణలో రక్షణ కరువవుతోంది. కొన్నేళ్లుగా గుర్తు తెలియని మహిళలు, ఇతర వ్యక్తులు జబ్బుకు జోలేలు ధరించి భక్తులను బలవంతంగా డబ్బులు ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని భక్తులు వాపోతున్నారు. మంగళవారం వరంగల్ నుంచి వచ్చిన మహిళలను ప్రసాదాల కౌంటర్ వద్ద ఐదుగురు మహిళలు డబ్బులివ్వాలంటూ వేధించినట్లు సాక్షికి తెలిపారు. ఆలయ అధికారులు, జిల్లాపోలీసు అధికారులు, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది పకడ్బందీ చర్యలు తీసుకుని భక్తులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

• బహుమతులు ప్రదానం

ముస్తాబాద్: వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో ఆవునూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. డిబేట్, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు దూడం మనోహర్ తెలిపారు. డిబేట్, వ్యాసరచన రెండు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు సాధించారన్నారు. డిబేట్‌లో విజేతలుగా నిలిచిన జి.స్నేహిత, ఆర్.సాహితీ, జె.శ్రావణి, వ్యాసరచన పోటీల్లో విజేతలైన జి.అక్షయ, ఆర్ ఉదయ, కె.తన్మయశ్రీని ,గైడ్ టీచర్ ఏ గణేశ్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

• నాటుసారా విక్రేతపై కేసు

కోనరావుపేట: నిజామాబాద్ గ్రామానికి చెందిన తాళ్లపెల్లి లచ్చయ్య లచ్చాపేటకు చెందిన గుగులోత్ ప్రమీల వద్ద నాటుసారా కొనుగోలు చేసి ఇంటిలో నిల్వ ఉంచాడన్న సమాచారం మేరకు దాడిచేశారు. 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. గుగులోత్ ప్రమీల, తాళ్లపెల్లి లచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

• కమిటీ ఎన్నిక

సిరిసిల్లటౌన్: తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా మిట్టపల్లి రాజమల్లు, అధ్యక్షుడిగా గీస భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా ఎగమంటి ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా గురజాల శ్రీధర్, కోల శ్రీనివాస్, రాపెల్లి రమేశ్, సహాయ కార్యదర్శులుగా గుంటుక నరేందర్, ఈసంపెల్లి రాజెల్లయ్య, భూమయ్య, భూక్య వెంకటి, కోశాధికారిగా సావణపెల్లి ప్రభాకర్‌తో పాటు 26 మందితో జిల్లా కమిటీ ఎన్నుకున్నారు.

• హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

సిరిసిల్లకల్చరల్: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ మంగళవారం తీర్పు వెల్లడించారు. ఎస్పీ మహేశ్ బి గితే తెలిపిన వివరాలు.. జూలపల్లి మండలం తేలుకుంట గ్రామానికి చెందిన మరిపెల్లి రాజయ్య వేములవాడ శివారులోని ఓ మామిడితోటలో కాపరిగా పని చేసేవాడు. పని విషయంలో రాజయ్యకు చింతల్‌ఠాణకు చెందిన మంత్రి ఆనందంకు తరచూ గొడవలు జరిగేవి. 2024 ఏప్రిల్ 29న రాజయ్య తన గది ముందు భోజనం చేస్తున్న సమయంలో అదను చూసి వెంట తెచ్చుకున్న పారతో ఆనందం దాడి చేశాడు. తలకు బలమైన గాయం తగిలి రాజయ్య మరణించాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పీపీ పెంట శ్రీనివాస్ కేసు వాదించగా న్యాయమూర్తి 16 మంది సాక్ష్యాలను పరిశీలించిన అనంతరం నిందితుడికి జీవితఖైదు, రూ.వెయ్యి జరిమానా విధించారు.

• విద్యుత్ వైరు అపహరణ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం శివారులో బంగ్లా ధర్మాగౌడ్ అనే రైతు పొలం నుంచి ఆదివారం రాత్రి విద్యుత్ వైరును దొంగలు ఎత్తుకెళ్లారు. రూ.30 వేల విలువైన విద్యుత్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారని ధర్మాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• పోలీసులకు ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలో ఓ మహిళ గొర్రె పిల్లను ఎత్తుకెళ్లేందుకు యత్నించగా గొర్రెల కాపరులు పట్టుకున్నారు. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామ శివారులో మందలోని గొర్రె పిల్లను ఓ మహిళ ఎత్తుకెళ్లేందుకు యత్నించింది. గొర్రెల యజమాని బాలమణితో పాటు కొందరు మహిళను పట్టుకున్నారు. బాలమణి ఫిర్యాదు మేరకు సదరు మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• ముందస్తు అరెస్టు

ముస్తాబాద్: వేతనాల పెంపుకోసం వైద్యశాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేపట్టిన చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌ను ఠాణాకు తరలించారు.

ఓజోన్ పొరను రక్షించుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్

వేములవాడఅర్బన్: ఓజోన్ పొర పరిరక్షణ మనందరి బాధ్యత అని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ పొర దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సూర్యుడి నుంచి వచ్చే అతినీల లోహిత కిరణాల నుంచి భూమిని ఓజోన్ పొర కాపాడుతుందాన్నారు. అనంతరం క్విజ్, వ్యకృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, ప్రసాద్, శోభరాణి, శ్రీధర్, శారద, శకుంతల, నర్సయ్య తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. రసాయనశాస్త్ర విభాగం అధ్యాపకురాలు వాణి ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు ధర్మపురి, శ్రావణ్‌కుమార్, ఆది విష్ణు, భిక్షమయ్య, శ్రీనివాస్, మనోహర్, సుచరణ్, కృష్ణప్రసాద్, మహేశ్, రమ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్‌స్పోర్ట్స్: కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ, యువభారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ఆన్‌లైన్ క్విజ్ కార్యకమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని మై భారత్, మేరా యువ భారత్ ఉమ్మడి జిల్లా యూత్ ఆఫీసర్ ఎం.వెంకట్‌రాంబాబు అన్నారు. 10వేల మంది యువతను క్విజ్ ప్రోగ్రాం ద్వారా ఎంపిక చేసి వివిధ స్థాయిల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు. అత్యంత ప్రతిభకనబర్చిన వారిని జిల్లా, రాష్ట్ర, దేశీయ స్థాయిలో ప్రభుత్వ ఖర్చులతో ఢిల్లీకి తీసుకెళ్తామని అన్నారు. చివరి అంకంలో దేశాభివృద్ధి, అభివృద్ధి చెందిన భారత్ కోసం దేశం అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధానితో చర్చించే అవకాశం ఉంటుందని తెలిపారు. క్విజ్ పోటీల్లో పాల్గొనే వారు ఇంగ్లిష్‌తో పాటు 12 భారతీయ భాషల్లో ఏదైన ఒక భాష ఎంచుకోవచ్చని అన్నారు. సెప్టెంబర్ 1, 2025 నాటికి 15–29 ఏళ్ల వయస్సు కలిగి ఆసక్తి గల యువతీ యువకులు ఆన్‌లైన్ ద్వారా మై భా రత్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

కేవీపీఎస్ మహాసభల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాగరాజు

సిరిసిల్లటౌన్: కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా మహాసభల పోస్టర్లను మంగళవారం జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు ఆవిష్కరించారు. ఈనెల 23,24 తేదీల్లో జిల్లా వస్త్ర పరిశ్రమ భవన్‌లో మహాసభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కుల వివక్ష, అంటరానితనంపై కేవీపీఎస్ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు పాల్గొంటారని, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గిరిబాబు, రాజు, వెంకటేశ్, నరేందర్, మోహన్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



బోయినపల్లి: విలాసాగర్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ ఊర చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చాలని, కొదురుపాక- విలాసాగర్, జగ్గారావుపల్లి - విలాసాగర్ రోడ్లలో కల్వర్టులు పూర్తి చేయాలని, లైబ్రరీ ఏర్పాటు, వేంకటేశ్వర స్వామి ఆలయానికి సీసీరోడ్డు, హైమాస్ట్ లైట్లు, ఆలయ ప్రహరీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ దయ్యాల కొమురయ్య, చొప్పదండి యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఏనుగుల ప్రశాంత్ కుమార్, గొట్ల భూమయ్య, బూర నరహరి, కొంకటి శ్రీధర్, అశోక్, తదితరులున్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి



సైకిళ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ముస్తాబాద్: విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ అన్నారు. మండలంలోని చీకోడు, నామాపూర్, పోతుగల్, కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. సేవాలాల్‌తండా, చిప్పలపల్లి గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరేశ్, వెంకన్న, శ్రీనివాస్‌రావు, గోపి, తిరుపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి ఎస్ఎస్ గార్డెన్‌లో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు మూడురోజుల పోషణ్ బీ పడాయి బీ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో రోజువారీ అందించే పోషకాహారం, బాలింత సేవలు, పూర్వ ప్రాథమిక సేవల గురించి వివరించారు. సీడీపీవో జి.ఉమారాణి మాట్లాడుతూ, దివ్యాంగ పిల్లల్ని ఎలా గుర్తించాలి, అందించే సేవలు, 5 ఏళ్లలోపు పిల్లల ఎత్తు, బరువు ఎలా నమోదు చేయాలి, సామ్ మామ్ గురించి తెలియజేశారు. శిక్షణ మూడు రోజులపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుశ్మిత, అంజలి, అరవింద, జిల్లా కోఆర్డినేటర్ బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ఇల్లంతకుంట: ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కందికట్కూర్, గాలిపెల్లి, గ్రామాల్లోని వరి, పెసర, మొక్కజొన్న, పంటలను శాస్త్రవేత్తలు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గాలిపెల్లి రైతు వేదికలో మొక్కజొన్నలో కలుపు యాజమాన్యం మీద రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కే మదన్మోహన్ రెడ్డి, హరికృష్ణ, రాంప్రసాద్, రాజేంద్రప్రసాద్, రజనీకాంత్, వ్యవసాయ అధికారి సురేశ్ రెడ్డి, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై కేసు

చందుర్తి: మహిళను లైగింక వేధింపులకు గురిచేసిన మైనర్ బాలుడిపై కేసు నమోదైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ భర్త మృతిచెందడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. గత నెల 23న రాత్రి 8.30 ప్రాంతంలో వర్షం పడుతున్న సమయంలో బాలుడు ఆమె ఇంటికి వెళ్లి వేధింపులకు గురిచేశాడు. ఈ విషయాన్ని తమ బంధువులకు తెలుపడంతో స్థానిక పెద్ద మనుషుల సమక్షంలో తీర్మానం చేసుకునేందుకు ఇరు వర్గాలవారు ఒప్పందం కుదుర్చుకున్నారు. మళ్లీ ఈ నెల 13న రాత్రి ఆమె ఇంటికి వెళ్లి వేధింపులకు గురి చేయగా మహిళ కుటుంబ సభ్యులు బాలుడిపై దాడి చేశారు. తమ బాలుడిని కొట్టారని కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా ఈ విషయమంతా బయటకు పొక్కింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.